## క్లుప్తంగా

### మన్మోహన్‌సింగ్‌కు నివాళి



నెల్లూరు(బారకాసు) : మాజీ ప్రధాని, పద్మవిభూషణ్ మన్మోహన్ సింగ్ మృతికి నగరపాలక సంస్థ శనివారం నివాళులర్పించింది. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి మేయర్ పొట్లూరి స్రవంతి, కమిషనర్ సూర్యతేజతో పాటు పలువురు అధికారులు అంజలి ఘటించి ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, డీసీపీ పద్మజతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

### అద్దె గృహాలపై పోలీసుల దాడులు

**వెంకటాచలం:** మండలంలోని కసుమూరులో అద్దె గృహాలపై దాడులను పోలీసులు శనివారం నిర్వహించారు. కసుమూరులోని రెండు అద్దె గృహాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని పోలీసులకు సమాచారాన్ని కొందరు అందించారు. దీంతో దాడులను చేపట్టి, రెండు జంటలను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

### రీ సర్వేపై గ్రామసభ

**పొదలకూరు:** మండలంలోని అయ్యగారిపాళెంలో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శివకృష్ణ మాట్లాడారు. రీ సర్వేకు గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేశారని తెలిపారు. దీంతో ముందుగా గ్రామసభను నిర్వహించి రైతులకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. ఒకట్రెండు రోజుల్లో రీ సర్వేను నిర్వహించనున్నారని చెప్పారు. అభ్యంతరాలుంటే రైతులు అప్పీల్ చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. సర్వేయర్ గోపీనాథ్ పాల్గొన్నారు.

### జగదేవిపేటలో ఉచిత వైద్యశిబిరం

**ఇందుకూరుపేట :** జాతీయ సేవా పథకంలో భాగంగా శ్రీవెంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో జగదేవిపేటలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సి.కిశోర్‌కుమార్ పాల్గొని వైద్యసేవలు అందించారు. అనంతరం ఆధునిక వ్యవసాయంపై రైతులకు సూచనలు చేశారు. పీఎం కిసాన్, మేఘదూత్ తదితరాల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకురా లు శైలజ, ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు పాల్గొన్నారు.

### విశేషాలంకారంలో వెంకయ్యస్వామి

**మనుబోలు:** మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో గల భగవాన్ వెంకయ్యస్వామి మందిరంలో స్వామివారికి విశేష పూజలను శనివారం నిర్వహించారు. పంచామృతాభిషేకాన్ని అర్చకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిపారు. విశేష పుష్పాలంకారంలో కొలువైన స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. అన్నప్రసాదాన్ని మధ్యాహ్నం అందజేశారు. ఉభయకర్తలుగా పోలంరెడ్డి వెంకురెడ్డి, వెంకటనాగేశ్వరి వ్యవహరించారు.

### విద్యుత్ స్తంభాలకు లైట్ల ఏర్పాటు



**పొదలకూరు:** పట్టణంలోని కేఆర్‌ఆర్‌నగర్‌లో విద్యుత్ స్తంభాలకు వీధి దీపాలను పంచాయతీ పాలకులు యుద్ధప్రాతిపదికన శనివారం ఏర్పాటు చేయించారు. వీధి దీపాలు సక్రమంగా వెలగడంలేదంటూ ఫిర్యాదులు ఇటీవల అందాయి. దీంతో స్పందించిన ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఒకటో వార్డు సభ్యుడు అంజద్ సమస్యను పరిష్కరించారు. వీధి దీపాలు ఎక్కడైనా వెలగకపోతే సమాచారమివ్వాలని శ్రీనివాసులురెడ్డి కోరారు.

# మేనేజర్ మాయాజాలం

- ఆయన చాంబర్‌లో గూడుపుఠాణి
- అక్కడ ఏం జరుగుతోందో ఎవరికీ తెలీదు
- పర్యవేక్షించాలంటున్న ఉద్యోగులు

**నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని ఓ అధికారి చాంబర్ అవినీతికి కేరాఫ్‌గా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అక్కడ ఏం జరుగుతుందో ఎవరికీ తెలియకుండా.. కమిషనర్‌కు ఉన్నవి, లేనివి చెబుతూ అంతా తానై చక్రం తిప్పుతున్న తీరును చూసి ఇతర ఉద్యోగులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.**



కార్పొరేషన్ కార్యాలయం

నెల్లూరు(బారకాసు) : నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ తర్వాత అంతటి ప్రాముఖ్యత ఉండేది మేనేజర్ పోస్టుకే. అయితే ఆయన చాంబర్‌లో ఏం జరుగుతుందో ఎవరికీ తెలీదు. ఇక్కడ ఏ ఉద్యోగికైనా పదోన్నతి కావాలన్నా.. బదిలీ జరగాలన్నా మేనేజర్ చాంబర్‌కు వచ్చి ముడుపులు ముట్టచెప్పుకుంటే వారి పని అయిపోయినట్లేనన్న విమర్శలు ఉన్నాయి. తనకు అనుకూలమైన వారి కోసం కమిషనర్ దగ్గర ఉన్నది, లేనివి చెప్పి పనిచేయించుకోగలిగే ఘనుడు మేనేజర్. అందుకే కొందరు ఉద్యోగులు వారి పనులు చేయించుకునేందుకు గంటల తరబడి మేనేజర్ చాంబర్‌లో కాలక్షేపం చేస్తుంటారు.

**రికార్డులో ఒకరి పేరు.. సీట్లో మరొకరు**

ఎస్‌ఎంసీకి మేనేజర్ పోస్టు ఒక్కటే ఉంది. ఈ పోస్టుకు అర్హత కలిగి మేనేజర్‌గా పదోన్నతి పొందిన ఉద్యోగి రాజేంద్రప్రసాద్. అయితే ఆయన్ను వీఆర్ జూనియర్ కళాశాలకు బదిలీ చేసి ఈ స్థానంలో సీనియర్లను కాదని జూనియర్ అయిన ఇనాయతుల్లాను మేనేజర్‌గా కూర్చోపెట్టడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. రికార్డులో మాత్రం మేనేజర్‌గా రాజేంద్రప్రసాద్ పేరు నమోదు చేసి ఆ ప్రకారంగా అతనికి జీతం ఇస్తూ విధులు మాత్రం వీఆర్ జూనియర్ కళాశాలలో నిర్వర్తించేలా చేయడం ఎంత వరకు సమంజసం అని పలువురు ఉద్యోగులు అంటున్నారు. ఒకవేళ ఇతరులకు మేనేజర్ పోస్టు కేటాయించాల్సి ఉన్నా.. ఇక్కడ సీనియర్లుగా ఉన్న సమద్, శ్రీనివాసులు, సులోచన, రాజేశ్వరికి ఇవ్వాల్సి ఉంది. అయితే నిబంధనలకు తిలోదకాలిచ్చి సీనియర్లను కాదని జూనియర్ అయిన ఇనాయతుల్లాను మేనేజర్‌గా నియమించడం చర్చనీయాంశంగా మారింది.

**గతంలో అనేక ఆరోపణలు**

ప్రస్తుతం మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఇనాయతుల్లాపై గతంలో అనేక ఆరోపణలున్నాయి. ఈయన అప్పట్లో మున్సిపల్ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తుండేవారు. తరువాత ఎస్‌ఎంసీ కార్యాలయంలో ఇన్‌చార్జి అకౌంటెంట్‌గా ఎక్కువ కాలం పనిచేశారు. అప్పుడే అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో అకౌంటెంట్ విధుల నుంచి తొలగించి సీ–3 సీటుకు కేటాయించారు. తరువాత మరోసారి 2018లో అకౌంటెంట్‌గా చేరి పలు అవినీతి, అక్రమాల ఆరోపణలతో సస్పెండ్‌కు గురయ్యారు.

**కొన్ని ఉదాహరణలు..**

ఎస్‌ఎంసీలోని ఓ విభాగానికి సంబంధించిన సూపరింటెండెంట్ కార్యాలయానికి రాగానే ముందుగా మేనేజర్ చాంబర్‌కు వెళ్లి హాజరు వేయించుకుని తరువాత తన విభాగానికి వెళ్తారు. ఇలా రోజులో కనీసం నాలుగైదు సార్లు మేనేజర్ చాంబర్‌కు సదరు సూపరింటెండెంట్ వస్తుంటారు. దీనికి కారణం ఎస్‌ఎంసీలో తనకు కావాల్సిన పోస్టును వేయించుకోవడం కోసమేనని పలువురు ఉద్యోగులు గుసగుసలాడుకుంటున్నారు.

⇨ లీగల్ సెల్ విభాగానికి సంబంధించిన సూపరింటెండెంట్ తనకు కేటాయించిన సీటులో కాకుండా మేనేజర్ చాంబర్‌లోనే ఉంటూ తన విధులతో పాటు మేనేజర్‌కు సంబంధించిన పనులు ఏమైనా ఉంటే అవి చేస్తూ కాలం గడుపుతున్నారు.

⇨ కమిషనర్ పీఆర్వోగా వ్యవహరిస్తున్న ఓ ఉద్యోగి కూడా మేనేజర్ చాంబర్‌లోనే ఉంటున్నారు. వాస్తవంగా ఆయన కమిషనర్ పేషీలో ఉంటూ మీడియా వారికి సంబంధించిన విషయాలను చూసుకుంటూ ఉండాలి. కమిషనర్ సమావేశాలు, పత్రికా ప్రకటనల వార్తలను మీడియా వారికి చేరవేస్తూ ఉండాలి. అయితే ఈయన మాత్రం ఆప్కాస్ ద్వారా నియమించబడిన ఓ ఉద్యోగి ద్వారా వాట్సాప్‌లో వార్తలు తెప్పించుకుని వాటిని పత్రికలకు ఫార్వర్డ్ చేస్తుంటారు. ఈ విషయం కమిషనర్‌కు కూడా తెలియదు.

**మేనేజర్ చాంబర్‌లోనే బిల్లుల తయారీ**

కార్పొరేషన్ కార్యాలయంలో జరిగే అనేక పనుల్లో కొన్నింటి బిల్లులు మేనేజర్ చాంబర్‌లోనే తయారు చేస్తుంటారు. అక్కడి నుంచి కమిషనర్‌కు పంపించుకుని మంజూరు చేయించుకుంటూ పనులు చేయించుకుంటారు. అయితే ఇందుకోసం మేనేజర్‌కు పదిశాతం చొప్పున కమీషన్ ముట్టచెబుతుంటారని సమాచారం. అంతేకాకుండా అవుట్ సోర్సింగ్, ఆప్కాస్ ద్వారా సిబ్బందిని నియమించుకునే విషయంలో ఈ మేనేజరే కీలకంగా వ్యవహరిస్తుంటారని సమాచారం. అవుట్ సోర్సింగ్ కింద నియమించుకునేందుకు ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సులు వస్తే వాటి ఆధారంగా లిస్టు తయారీ విషయంలో నిరుద్యోగుల వద్ద అధిక మొత్తంలో ముడుపులు గుంజుతుంటారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారి అయిన కమిషనర్ ఎస్‌ఎంసీ కార్యాలయంలోని ఆయా విభాగాల్లో ఏం జరుగుతుందో సీసీ కెమెరాల ద్వారా పరిశీలన జరిపితే వాస్తవాలు బయటపడనున్నాయి. ఆ దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని డీఆర్‌డీఏ సబ్‌స్టేషన్, సండేమార్కెట్ విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతులు, కొత్త ఏబీ స్విచ్‌ల ఏర్పాటు నేపథ్యంలో ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని విద్యుత్‌శాఖ టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పొగతోట, బృందావనం, మంగళివీధి, ఏసీఎస్ బిల్డింగ్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

### సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలి



ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నెల్లూరులో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ నగర కమిటీ ఆధ్వర్యంలో ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతాల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ, వచ్చే ఏడాది ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు నెల్లూరులో జరిగే సీపీఎం 27వ రాష్ట్ర మహాసభల్లో అనేక తీర్మానాలు చేస్తామన్నారు. అన్నివర్గాల ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శి, వర్గ సభ్యులు నాగేశ్వరరావు, మస్తాన్‌బీ, సూర్యనారాయణ, నగర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సేవలు అభినందనీయం



విజేతలకు బహుమతుల ప్రదానం

నెల్లూరు(బారకాసు) : కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలు అభినందనీయమని ది నెల్లూరు జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పేరూరి ప్రదీప్‌కుమార్ అన్నారు. కేతా అంకుల్ శత జయంతి సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని సుబేదారుపేటలో చిన్నారులకు ముగ్గులు, పాటలు, నృత్య పోటీలను శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రదీప్ కుమార్ హాజరై, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ సంపాదనలో కొంత సమాజ సేవకు ఖర్చు చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు, అమానుల్లాఖాన్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## వీధిలైట్ల పనితీరుపై కమిషనర్ ఆరా



నెల్లూరు(బారకాసు) : స్థానిక వేదాయపాళెం ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ వీధిలైట్ల పనితీరును కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ శుక్రవారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ విద్యుత్ దీపాలకు సంబంధించి ఏదైనా సమస్య ఉంటే స్థానిక సచివాలయంలో తెలియజేయాలని సూచించారు. అదేవిధంగా జంక్షన్‌లు, ప్రధాన మార్గాల మలుపుల వద్ద హైమాస్ట్ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు.

## మండల సైన్స్ ఫెయిర్‌కు జెడ్పీ విద్యార్థులు



నెల్లూరు (టౌన్) : దర్గామిట్టలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పాఠశాల స్థాయి సైన్స్ ఫెయిర్‌ను శనివారం నిర్వహించారు. వ్యక్తిగత విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థి నాయిబ్ రసూల్, గ్రూపు విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థులు బ్రహ్మ నిఖిల్, సందీప్, ఉపాధ్యాయుల విభాగంలో బయాలజికల్ టీచర్ వరలక్ష్మి ఎంపికైనట్లు హెచ్‌ఎం కృష్ణారెడ్డి తెలిపారు.

## ఘనంగా ‘అవెన్యూస్’ క్రీడా దినోత్సవం



విజేతలను అభినందిస్తున్న పాఠశాల నిర్వాహకులు

నెల్లూరు(అర్బన్) : నగరంలోని అవెన్యూస్ సీనియర్ సెకండరీ పాఠశాల ఆధ్వర్యంలో స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వార్షిక క్రీడా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు నృత్యం, యోగా, కరాటే, పరుగు పందెం లాంటి పలు క్రీడల్లో పోటీపడ్డారు. ముఖ్య అతిథిగా హాజరైన కెనరా బ్యాంక్ రీజనల్ హెడ్ నాగరాజు మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యంతో పాటు ఆనందానికి, ఐక్యతకు కారణమవుతాయన్నారు. పాఠశాల వ్యవస్థాపకుడు రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ దివ్యరెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యతో పాటు సాంస్కృతిక, క్రీడా రంగాలకు సమ ప్రాధాన్యత ఇస్తామన్నారు. డీకేడబ్ల్యూ పాఠశాల పీడీ సి.విజయకళ, డీఎస్‌డీఓ యతిరాజ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలన్నారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కృష్ణచైతన్య, వ్యాయామ ఉపాధ్యాయుడు కరీముల్లా, ప్రవీణ్, సుకృత, పాఠశాల చైర్మన్ బాబునాయుడు పాల్గొన్నారు.

### గంజాయిని అరికట్టాలి

నెల్లూరు(సెంట్రల్) : రూరల్ పరిధిలో డ్రగ్స్, గంజాయిని పూర్తిస్థాయిలో అరికట్టాలని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన కార్యాలయంలో శనివారం పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. పోలీసులు కఠినంగా వ్యవహరించాలని కోరారు.

### అన్నదానం



నెల్లూరు(బారకాసు) : స్థానిక పడారుపల్లిలోని సమాజ మందిరంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దొడ్డమరెడ్డి వెంట్రామిరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు విజయభాస్కర్‌రెడ్డి, కోడలు సుమతిల ఆర్థిక సాయంతో మందిరంలోని వికలాంగులు, వృద్ధులు, పేదలకు అన్నదానం చేసినట్లు క్రాంతి మహిళా మండలి ఫౌండర్ జి.వెంకటలక్ష్మి తెలిపారు. మమతరెడ్డి, హరనాథ్‌రెడ్డి, విజయలక్ష్మి, తంబయ్యనాయుడు, వెంకటేశ్వర్లు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### యూరియా కొరత లేకుండా చూడరూ..



వినతిపత్రమిస్తున్న బీజేపీ నేతలు

నెల్లూరురూరల్ : జిల్లాలో యూరియా కొరత తీవ్రంగా ఉందని, సమస్యను పరిష్కరించాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు డీఏఓ సత్యవాణికి శనివారం కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నీలిశెట్టి లక్ష్మణరావు, కంచర్ల నారాయణయాదవ్, కల్లు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ బిల్లులను నేడూ చెల్లించొచ్చు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ బిల్లులను ఆదివారం యథావిధిగా చెల్లించొచ్చని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు పనిచేయనున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్పీడీసీఎల్ కస్టమర్ యాప్ ద్వారా ఇంటి నుంచే బిల్లులు చెల్లించే వెసులుబాటును సంస్థ కల్పించిందని పేర్కొన్నారు.

### గ్రామ సచివాలయ సందర్శన

ఇందుకూరుపేట : విద్యా కోర్సులో భాగంగా మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం స్థానిక గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. వివిధ విభాగాలు, ఆన్‌లైన్ అప్లికేషన్ తదితర అంశాలపై సచివాలయ సిబ్బంది విద్యార్థులకు వివరించారు. తొలుత విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం సుహాసిని, ఉపాధ్యాయులు వై.మునీంద్ర, మురళీధర్, కమలాకర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

## ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఏర్పాట్ల పరిశీలన



నెల్లూరు(బారకాసు) : నగరంలోని దర్గామిట్టలో ఉన్న రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నూతన ధ్వజస్తంభం ఏర్పాటు, నవగ్రహ మండపం మార్పు, అన్నదాన భవన నిర్మాణ ఏర్పాట్ల విషయమై శనివారం పలువురు అధికారులు పరిశీలించారు. దేవదాయశాఖ గుంటూరు డిప్యూటీ ఇంజినీర్ సీహెచ్ శ్రీనివాసరావు ఇక్కడి దేవస్థానానికి విచ్చేసి ఆయా ఏర్పాట్లపై ఆరా తీశారు. ప్లానింగ్, ఎస్టిమేట్స్ వేసిన అనంతరం పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సహాయ కమిషనర్, ఆయన కార్యనిర్వాహణాధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, పి.సురేంద్ర, స్థపతి, మురళి, ప్రధాన అర్చకుడు రఘురామమూర్తి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## టేబుల్ క్యాలెండర్ల ఆవిష్కరణ



నెల్లూరు(బారకాసు) : జిల్లా ప్రజలకు ఉపయోగపడే సమాచారంతో ముద్రించిన టేబుల్ క్యాలెండర్‌ను నిర్మల నరసింహారెడ్డి నగరంలోని తన కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరుకు సంబంధించిన డాక్టర్లు, కల్యాణ మండపాలు, హోటల్స్, ఆర్టీసీ ఎంక్వైరీ, రైల్వే టైమ్ టేబుల్, ఆరోగ్య– సౌందర్య చిట్కాలు, ఎలక్ట్రానిక్స్ షాపులు తదితర వాటికి సంబంధించిన వివరాలను టేబుల్ క్యాలెండర్ పుస్తకంలో పొందుపరిచినట్లు వివరించారు. కార్యక్రమంలో హైటెక్ రమణారెడ్డి, వెందోటి ధనుంజయరెడ్డి, కోవూరు జక్కంరెడ్డి, బీవీరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రమణారెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



సమావేశానికి హాజరైన అధికారులు

నెల్లూరు(బారకాసు) : పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని ఎస్‌ఎంసీ అదనపు కమిషనర్ నందన్ తెలిపారు. ఎస్‌ఎంసీలోని కమాండ్ కంట్రోల్ సమావేశ మందిరంలో మెప్మా పీడీ రాధమ్మ, పలువురు అధికారులతో పాటు ఆర్పీలతో ఆయన శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ వన్ ఫ్యామిలీ–వన్ ఎంటర్ ప్రెన్యూర్ కార్యక్రమంలో భాగంగా పొదుపు సంఘాల సభ్యుల తలసరి ఆదాయం పెంచాలనే లక్ష్యంతో రానున్న వంద రోజుల్లో జీవనోపాధుల కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. వంద రోజుల ప్రణాళికలో మార్చినాటికి అధిక మందికి కొత్త రుణాలు, కేంద్ర ప్రభుత్వ పథకాల యూనిట్ల ఏర్పాటు లక్ష్యంగా ముందుకెళ్లాలన్నారు. ఎంఎస్‌ఎంఈల రిజిస్ట్రేషన్‌లు అధికంగా జరిగేలా చూడాలన్నారు. పీడీ రాధమ్మ మాట్లాడుతూ మెప్మా ద్వారా మహిళల జీవనోపాధులను మెరుగుపరిచి మహిళా పారిశ్రామికవేత్తలుగా మార్చడమే ధ్యేయంగా ఆర్పీలు పనిచేయాలని సూచించారు. సమావేశంలో టీఈ అంకయ్య, సుధాకర్, కాంతయ్య, సీఎంఎంలు కవిత, జరీనా, సీఓలు, ఆర్పీలు పాల్గొన్నారు.

## నిరసన ప్రదర్శన రేపు



మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఈనెల 30న నిరసన ప్రదర్శన చేపడుతున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు రాంబాబు డిమాండ్ చేశారు. నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న సీపీఎం జిల్లా కార్యాలయంలో వామపక్ష నాయకులు శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ, నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ నుంచి వీఆర్సీ సెంటర్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన, ర్యాలీని తలపెట్టామన్నారు. ప్రజాసంఘాలు, వామపక్షవాదులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, మంగళ పుల్లయ్య, జిల్లా కమిటీ నాయకులు కత్తి శ్రీనివాసులు, జిల్లా నేతలు షాన్‌వాజ్, రమణయ్య, పౌరహక్కుల సంఘం నేత ఎల్లంకి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### విజయ డెయిరీలో వైద్యశిబిరం



నెల్లూరు(సెంట్రల్) : వెంకటేశ్వరపురంలోని విజయ డెయిరీలో ఉచిత వైద్యశిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ రెయిన్‌బో ఆస్పత్రి ఆధ్వర్యంలో దాదాపు 200 మంది సిబ్బందికి వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యుడు అనిల్, మెడికల్ సూపరింటెండెంట్ సునీల్‌కుమార్, డెయిరీ ఫైనాన్స్ మేనేజర్ శ్రీనివాసరావు, మేనేజర్ రాజశేఖర్‌రెడ్డి, అడ్మిన్ శివయ్య పాల్గొన్నారు

### పాతూరి అన్నపూర్ణకు సత్కారం



నెల్లూరు(బారకాసు) : నెల్లూరు జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాతూరి అన్నపూర్ణకు ఘన సత్కారం లభించింది. విజయవాడలోని తెలుగు మహాసభలో ఆమె కవితలు అలరించాయి. దీంతో శనివారం సత్కరించి అభినందించారు.